

సంక్షేమ పథకాల కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

దేశంలో ఎక్కడా లేని విధంగా ఏడాది పొడవునా ఏ నెలలో ఏ సంక్షేమ పథకాల లబ్ది అందిస్తున్నామనేది సంక్షేమ క్యాలెండర్ ద్వారా ముందుగానే ప్రకటించి తదనుగుణంగా ఆయా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికే దక్కుతుందని ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. సంక్షోభాలెన్ని వున్నా చెప్పిన సమయానికి పథకాలను అందించడం మరెవరికీ సాధ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ కేలెండర్‌ను కోలగట్ల గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టోలో చెప్పిన 98.44 శాతం హామీలను ఇప్పటికే ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, ఎవి సూపర్‌వైజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉద్యమాల ఊపిరి.. శేషగిరి

నేడు రెండో వర్ధంతి

అందరూ గిరి లేదా మాస్టారూ అని ఆప్యాయంగా పిలిచే శేషగిరి కన్నుమూసి రెండేళ్లు గడిచిపోయింది. ఉపాధ్యాయ నాయకుడిగా, ప్రజాతంత్ర ఉద్యమ కార్యకర్తగా, అధ్యయన శీలిగా, అభ్యుదయ రచయితగా, పోరాటంలో సృజనాత్మక శిల్పిగా, ముక్కుసూటి మనిషిగా, ఎడ్యుకేటర్‌గా ఇలా ఒకటేమిటి సమాజంలో బహుముఖ పాత్ర పోషించారు. శేషగిరి 48 ఏళ్ల జీవిత కాలంలో 28 ఏళ్లు ఉద్యమమే ఊపిరిగా జీవించారు. నిత్యం ఉద్యోగుల, ప్రజల సంక్షేమం కోసం పరితపించారు.

- ప్రజాశక్తి, విజయనగరం

సాహితీ ఆలోచన నుండి ఉద్యమంలోకి

ఉద్యమ కుటుంబంలో పుట్టిన శేషగిరి వామపక్ష భావజాలం గల వ్యక్తి. చిన్ననాటి నుంచే అభ్యుదయ భావాలు గలవాడు. విద్యార్థిగా ఉన్నప్పుడే తన సహచరులతో కలిసి ఓ సాహిత్య పత్రిక స్థాపించేందుకు ప్రయత్నించారు. అనంతర కాలంలో సమాజంలో నెలకొన్న దురాగతాలను ఎండగట్టేందుకు కవులు, రచయితలతో సంబంధాలు పెంచుకున్నారు. తరువాత 1992 నుండి 94 వరకు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా జిల్లాలో విద్యార్థి ఉద్యమ అభివద్ధికి కృషి చేశారు. తరువాత ఉపాధ్యాయ ఉద్యమంలో పనిచేసినప్పటికీ విద్యార్థి సంఘం నాయకుల సైద్ధాంతిక, రాజకీయ స్థాయి పెంచడం, ఉద్యమం పట్ల వారిలో విశ్వాసం పెంచడంతో పాటు వారి వ్యక్తిగత యోగక్షేమాలు చూసేవారు.

సూటా ఉద్యమంలో కీలక పాత్రధారి

ఎన్‌టి రామారావు రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత 1994 డిఎస్‌సిలో అవకతవకలు జరిగాయని డిఎస్‌సిని రద్దు చేశారు. ప్రభుత్వం తప్పుడు నిర్ణయం వెనక్కి తీసుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధ్యాయులుగా నియమించాలని విజయనగరం నుండి ఉద్యమం ప్రారంభమైంది. ఆ నాయకత్వంలో శేషగిరి ముఖ్యుడు. ఆ ఉద్యమాన్ని రాష్ట్రమంతా విస్తరింప జేయడం, పోరాటాలు రూపొందించడంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. రెండేళ్ల ఉధృత పోరాటాల అనంతరం ఎన్‌టి రామారావు ప్రభుత్వం నిర్ణయం మార్చుకొని 1994 డిఎస్‌సిలో ఉత్తీర్ణులైన వారిని ఉపాధాయులుగా నియమించింది.

యుటిఎఫ్ విస్తరణలో ముఖ్య పాత్రధారి

ఉపాధ్యాయ సమస్యలపై అత్యంత సృజనాత్మకంగా పోరాటాలు నడిపేవారు. ఆ పోరాటిమతోనే జిల్లా కార్యదర్శిగా, అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర కార్యదర్శిగా ఎదిగారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్యకర్తలతో విస్తృతమైన సంబంధాలు ఉండడంతో ఫ్యాప్టో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. శేషగిరి నిరంతర అధ్యయన శీలి. సిద్ధాంత అధ్యయనమే గాక స్థానిక సమస్యలపై అధ్యయనం చేసేవారు. ఉపాధ్యాయుల, విద్యా సంబంధిత సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి నిర్దిష్టమైన కార్యాచరణ చేసేవారు. అందుకే ఉపాధ్యాయులందరికీ ఆప్తుడయ్యారు. అందరికీ ఆమోదయోగ్యమైన నాయకుడయ్యాడు.

సైద్ధాంతిక కృషీవలుడు

తొలి నుంచీ ప్రజాతంత్ర విప్లవ సాధన కోసం పరితపించే గిరి మాస్టారు ఓ వైపు ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతునే జిల్లాలో జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు నుంచి పనిచేశారు. అనంతరం టీచర్ అండ్ స్టడీ సర్కిల్ పేరిట సమకాలిన అంశాలపై జిల్లా, డివిజన్ స్థాయిలో సదస్సులు క్రమం తప్పకుండా నిర్వహించేవారు. కొంతకాలానికి దానిపేరు గురజాడ విజ్ఞాన కేంద్రంగా మారింది. దాని ద్వారా సదస్సులు, సెమినార్‌లు, స్టడీ సర్కిల్స్ నిర్వహిస్తూ మధ్యతరగతి ఉద్యోగుల్లో రాజకీయ, సైద్ధాంతిక అవగాహన పెంచేందుకు కృషిచేశారు. అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాలను కలుపుకొని కార్యాచరణకు పూనుకొనేవారు. ప్రదర్శనలు, బహిరంగ సభలకు వందలు, వేలాది మందిని సమీకరించేవారు. అందువలనే జిల్లాలో ఐక్య ఉద్యమాల రథసారథిగా శేషగిరి అందరి మన్ననలు పొందారు.

విధానాలపై పోరాట యోధుడు

నాడు సిపిఎస్, నేడు నూతన విద్యావిధానంపై లోతైన అధ్యయనం చేసి అంతే పట్టుదలగా ఉపాధ్యాయులను, విద్యార్థులను కదిలించడంలో శేషగిరి ముఖ్య పాత్రధారి. సిపిఎస్ ముప్పును గుర్తించిన తొలి రోజుల్లో విజయనగరం జిల్లాలో ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారు. మోడీ ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానాన్ని సమూలంగా అర్థం చేసుకొని దానిపై ప్రతి హైస్కూల్ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, అన్ని సంఘాల నాయకత్వాన్ని ఒప్పించి పెద్ద పెద్ద ప్రదర్శనలు, సభలు నిర్వహించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీరణ విధానాలపై సర్వత్రా వెలువడుతున్న వ్యతిరేకతను కూడగట్టి అందరినీ ఒకచోటకు చేర్చి సంఘటితం చేయాలనే ఉద్దేశంతో 18-4-2021న విజయనగరంలో శేషగిరి నిర్వహించిన సభ అతని జీవితంలో చివరిది.

ఉద్యమ విస్తృతే నిజమైన నివాళి

ఉపాధ్యాయ ఉద్యమం, ప్రజాతంత్ర ఉద్యమం వేగంగా ఎదుగుతున్న ఉద్యమ నేతను కోల్పోయింది. శేషగిరి వదిలి వెళ్లిన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లి ఆయన లేని లోటును భర్తీ చేసుకోవడమే శేషగిరికి ఉద్యమ శ్రేయోభిలాషులంతా ఇవ్వగలిగే నిజమైన నివాళి.

నేడు వర్ధంతి సభ

ఉపాధ్యాయ, ఉద్యోగ, ఐక్య ఉద్యమాల రథసారధి కె.శేషగిరి రెండో వర్ధంతి సభ శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'భారత రాజ్యాంగం-ఆర్థిక విధానాలు, సామాజిక న్యాయం' అనే అంశంపై పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. వక్తలుగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.



కళాశాల భవనాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

వైద్యకళాశాల త్వరగా పూర్తి

అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ వైద్యకళాశాల భవనాలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక ట్రైబల్ యూనివర్సిటీ సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలను ఆమె గురువారం ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, సెమినార్ హాలు, హాస్టల్ తదితర భవనాల నిర్మాణాన్ని, వాటి నాణ్యతను, ఇతర సదుపాయాల కల్పనను పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన ఖర్చు, చేసిన పనులు, బిల్లుల పరిస్థితి, సిమ్మెంట్, ఐరన్, ఇసుక సరఫరా, పనివారి సంఖ్య తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఎపి ఎంఎస్ఐడిసి అధికారులు ఆయా భవనాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. తరగతి గదుల నిర్మాణం పూర్తయ్యిందని, విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్, ఫ్లోరింగ్, వెలుపల గోడలకు ప్లాస్టింగ్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు. మరో రెండునెలల్లో పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కళాశాలకు నీటి సదుపాయం కోసం సంప్‌ట్యాంకును నిర్మించామని, తాత్కాలికంగా మున్సిపాల్టీ నుంచి రోజుకు సుమారు 35వేల లీటర్ల నీటిని ఇప్పించాలని అధికారులు కోరారు. మెడికల్ కాలేజీకి నీటి అవసరాలను శాశ్వతంగా కల్పించేందుకు చంపావతి నదినుంచి పైప్‌లైన్ వేసేందుకు రూ.10కోట్లు ఖర్చుతో ప్రతిపాదనలు సిద్దంగా ఉన్నాయని వివరించారు.


కలెక్టర్ నాగలక్ష్మి స్పందిస్తూ, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తాత్కాలికంగా నీటిని ఇప్పించేందుకు వెంటనే సంబంధిత అధికారులతో చర్చిస్తానని చెప్పారు. శాశ్వత పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తరగతి భవనాల నిర్మాణం దాదాపు పూర్తి అయినప్పటికీ, ఇతర పనులు పెండింగ్ ఉన్నాయని, వాటిని పూర్తిచేసేందుకు నిపుణులైన పనివారి సంఖ్యను పెంచాలని సూచించారు. భవన నిర్మాణ పనులను, రహదారిని వీలైనంత త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పద్మలత, ఎపిఎంఎస్ఐడిసి సూపరింటిండెంట్ ఇంజనీర్ అంకమ్మ చౌదరి, ఇఇ సత్య ప్రభాకర్, విశాఖ ఎస్ఇ శివశంకర్, తాహశీల్దార్ సిహెచ్‌బంగార్రాజు, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

8న మహిళా పార్కు ప్రారంభం

హాజరు కానున్న మంత్రులు బొత్స సత్యనారాయణ, ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహిళల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన మహిళా పార్కును ఈనెల 8న రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ,ఆర్‌కె రోజా ప్రారంభిస్తారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. గురువారం పార్కును పరిశీలించారు. అభివృద్ధి పనులు ఏ మేరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. 8వ తేదీ కల్లా అన్నీ సమకూర్చి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అదే ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి మహిళా పార్కును ఈనెల 8న ప్రారంభించి 11వ తేదీ కల్లా మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తామనితెలిపారు.మహిళలకు ఉపయుక్తంగా ఉండే విధంగా ఓపెన్ జిమ్, స్విమ్మింగ్ పూల్, పిల్లలకు క్రీడా ప్రాంగణం, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేశామన్నారు. కోటి 60 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన మహిళా పార్కును మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్, ఫోరం ఫర్ పీపుల్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ సతీష్ మాటూరు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయవంతంగా గడప గడపకూ

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన పట్ల ప్రజాస్పందన అనూహ్యంగా లభించడంతో గడపగడపకు మన ప్రభుత్వం విజయవంతంగా సాగుతోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి ప్రాంతంలో నిర్వహించిన గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ప్రజల నుండి కూడా ప్రభుత్వం పై స్పందనను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారులకు ఏ మేరకు ప్రభుత్వం నుండి లబ్ధి చేరిందో వివరించే బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు, స్థానిక కార్పొరేటర్ పతివాడ గణపతిరావు మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో 2 కోట్ల రూపాయలతో వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టి ప్రజల దాహార్తిని తీర్చే బృహత్తర కార్యక్రమాన్ని డిప్యూటీస్పీకర్ కలగట్ల వీరభద్రస్వామి చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, సహాయ కమిషనర్ ప్రసాద్ రావు, జోనల్ ఇన్చార్జి మారెం బాల బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఇవిఎంలకు పటిష్ట భద్రత : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఇవిఎం గోదాముల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. నెల్లిమర్లలో ఇవిఎం గొడౌన్లను ఆమె గురువారం తనిఖీ చేశారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. భవనం పైభాగంలో అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. భవనంలోని సిసి కెమేరాలను మరమ్మతు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. వేర్వేరు గోదాముల్లో ఉన్న ఇవిఎంలను ఒకే భవనంలోకి తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తాహశీల్దార్ రమణరాజు, ఎంపిడిఒ జి.గిరిబాల, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఎలక్షన్ సెల్ సూపరింటిండెంట్ నీలకంఠరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న విద్యార్థులు

'సీతం'లో ముగిసిన పారిశ్రామిక శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో డాక్టర్ రెడ్డిస్ పారిశ్రామిక సంస్థకు చెందిన విద్యార్థులకు 45 రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు. మొత్తం 52 మంది విద్యార్థులకు రసాయన శాస్త్రం, అంకగణితం, ఇంగ్లీషుకు సంబంధించిన పాఠ్యాంశాలను సీతం కళాశాల అధ్యాపకులు బోధించారు. ఈనెల6న రెడ్డీస్ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి,పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు శిక్షణ పొందిన విద్యార్థులు అందరూ ఉద్యోగావకాశాలు సాదించాలని ఆశాభావం వ్యక్తం చేసారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ తో ఏదైనా నేర్చుకుంటే దేనినైనా సాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి. హెచ్.వెంకట లక్ష్మి, ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, శిక్షణ, ప్లేస్‌మెంట్ అధికారి బికె రావుపాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న అసో సియేషన్ నాయకులు జ్వాలాముఖి

చదరంగంలో జిల్లా క్రీడాకారులకు పతకాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో ఫైర్ చెస్ స్కూల్ విద్యార్థులు 14 మందికి వివిధ కేటగిరిలో బహుమతులు వచ్చాయి. ఓపెన్ కేటగిరిలో కె. ప్రహ్లద్, అండర్ 11 కేటగిరిలో కె. సోమనాథ్ (కేంద్రీయ విద్యాలయ), సత్య సాగర్ నాయుడు, ఎం.జయ శ్రీ (పిఎస్‌ఆర్‌స్కూల్), కె.దివీస్, జి.కాశిష్ (సన్ స్కూల్), ఎస్.జోషిత్, కె.కీర్తి (నారాయణ స్కూల్), షేక్ షకీల్ (నవోదయ), బి.అభయ్‌సాయి (ఢిల్లీ పబ్లిక్ స్కూల్), ఎన్. ప్రియాంక, ఎం సుహాన్స్ (శ్రీ చైతన్య స్కూల్), రిజ్వాన్(పోర్ట్ సిటీ), కె.రిషి (మై లైఫ్ స్కూల్) వివిధ కేటగిరీలో బహుమతులు పొందారు. క్రీడాకారులను కెవి జ్వాలాముఖి, కోచ్ అభినందించారు.

బిసిలకు రాజ్యాధికారంలో భాగం కల్పించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసిలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కల్పించాలని జాతీయ బిసి సంఘం అధ్యక్షుడు గదుల వెంకటరావు డిమాండ్ చేశారు.గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 5న రాజమండ్రిలో అన్ని జిల్లాల బిసి నాయకులతో ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షులు లాకా వెంగళరావు ఆధ్వర్యంలో విస్తతస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో బిసిలను రాజ్యాధికారంలో తేవడానికి ముఖ్య ప్రణాళికలు తయారు చేస్తామన్నారు. రాజమండ్రిలో జరిగిన విస్తస్థాయి సమావేశానికి హాజరుకావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం పిలుపునిస్తుంది. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ముడిలి నాగభూషణం, వర్కింగ్ ప్రెసిడెంట్లు చోడి ఆదినారాయణ, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశమిచ్చి మోసపోయారు

టిడిపి నాయకులు కోండ్రు మురళి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒక్క అవకాశమని చెప్పి జగన్మోహన్‌రెడ్డిని గెలిపించి రాష్ట్ర ప్రజలు మోసపోయారని టిడిపి నాయకులు, మాజీ మంత్రి కోండ్రు మురళీ అన్నారు. రాష్ట్రంలోకి పెట్టుబడిదారులు వస్తే వారి దగ్గర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కలెక్షన్లు వసూలు చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. గురువారం స్థానికటిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, ఎస్.కోట నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోళ్ల లలితకుమారితో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగాలన్నీ ఉత్తరాంధ్రకు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం హాస్యాస్పదమని అన్నారు. జగన్ సిఎం అయిన తరువాత రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య దేశంలో ఎక్కడా లేని విధంగా పెరిగిందన్నారు. ఒక్క జాబ్ క్యాలండర్ కూడా ఇవ్వలేదని, కనీసం పోలీసు ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని అన్నారు. జగన్‌ను చూసి పెట్టుబడిదారులు పక్క రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారని విమర్శించారు. దేశంలోనే గంజాయి మత్తులో రాష్ట్రం నెంబర్ వన్‌గా ఉందన్నారు. యువతను మత్తు బానిసలుగా చేస్తున్నారని అన్నారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని దుయ్యబట్టారు.

రాష్ట్ర అధికార ప్రతినిధిద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 48 లక్షల మంది గ్రాడ్యుయేషన్ ఉంటే అందులో 70శాతం మంది నిరుద్యోగులుగానే బతుకుతున్నారని అన్నారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విధ్వంసపాలనే తప్ప మరేమీ లేదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కోండ్రు మురళి

కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన వాటిని జగన్ పూర్తి చేసి ఉంటే రాష్ట్రంలో చాలా మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వచ్చిఉండేవని అన్నారు. ఒక్క అవకాశమని చెప్పుకొచ్చిన జగన్మోహన్ రెడ్డిని నమ్మి ఓటేసిన ప్రజలు మోసపోయారని అన్నారు. సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వి పి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కంది మురళీమోహన్, రొంగలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నూతన ఇన్నోవా క్రిస్టా ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం

టయోటా కిర్లోస్కర్ మోటర్ (టికెఎం) తమ నూతన ఇన్నోవా క్రిస్టా రెండు గ్రేడ్స్ (జెడ్ఎక్స్, విఎక్స్) ధరలను వెల్లడించింది. ఈ వాహనం మెరుగైన ఫ్రంట్ ఫేసిమా కలిగి ఉంటుంది. దీన్ని ధడమైన ప్రదర్శన కోసం నిర్ధిష్టమైన ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ టొయోటా షోరూంలో గురువారం ఏర్పాటు చేసిన వర్చ్యువల్ సమావేశం ద్వారా టయోటా కిర్లోస్కర్ మోటర్ సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ మాట్లాడారు. నూతన ఇన్నోవా క్రిస్టాను రూ.50వేలు చెల్లించి బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. వినియోగదారులు డీలర్ ఔట్‌లెట్లతో పాటుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

మార్కెట్‌లోకి విడుదల చేసిన ఇన్నోవా క్రిస్టా కారు





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి హైమావతి

అధికారుల గైర్హాజరుపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి-గంట్యాడ

గంట్యాడ మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు అవ్వడంపై ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపిపి హైమావతి అధ్యక్షతన జరిగింది. పలుశాఖల అధికారులతో సమీక్ష జరిపారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు ప్రజాప్రతినిధులు అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కొన్ని శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరావడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటి చర్యలు పునరావృతం అయితే ఉపేక్షించేది లేదని అన్నారు. సమావేశంలో ఎస్‌సి సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్, జెడ్‌పిటిసి సభ్యులు నరసింహమూర్తి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ భానోజీరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

8న వేసవి శిక్షణ తరగతులు ప్రారంభం

బాడంగి: ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకూ 35 రోజుల పాటు స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని గ్రంథాలయాధికారి దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. ముఖ్యంగా పిల్లల అభివృద్ధికి అవసరమయ్యే క్లాసులు నిర్వహిస్తామన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు చదివించడం, మాథ్స్, కంప్యూటర్ బేసిక్స్, పిల్లలు సమాజంలో ఏవిధంగా నడుచుకోవాలో శిక్షణ ఇస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించాలని ఆయన కోరారు.

ప్రధానోపాధ్యాయులతో డిఇఒ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వర్‌రెడ్డి

డెంకాడ : జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర్ రెడ్డి గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో మనబడి నాడు నేడు ఫేస్-1, ఫేస్ -2 ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి అన్ని కాంపోనెంట్స్ పూర్తిచేయాలన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం సహాయంతో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు, నాడు నేడు సైట్ ఇంజనీర్ రాజు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న సిఆర్‌పి

వేపాడ : మండలం లోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫేజ్-2 నాడు నేడు పనులను సిఆర్‌పి కాటపల్లి రాంప్రసాద్ గురువారం పరిశీలించారు. పనులకు అవసరమైన సిమెంట్‌ని కూడా పాఠశాలకు అందజేశారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయుడు రవిశంకర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయ ప్రకాష్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

భోగాపురం : హాత్ సే హాత్ జోడో అభియాన్ (చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం) కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం గుడివాడ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవానికి కృషి చేస్తున్నామని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బల్పరిచే దిశగా హాత్ సే హాత్ జోడో అభియాన్ పేరుతో నియోజకవర్గంలోని ఇప్పటికే నాలుగు మండలాలలో పర్యటించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రామకృష్ణ, ఎస్ సూరిబాబు, రమణ, అప్పల రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి సురేష్ ముఖర్జీ

తాగునీటి ఎద్దటి నివారణకు చర్యలు

వంగర : వేసవి దృష్ట్యా మండలంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి ఎద్దటి లేకుండా నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ తెలిపారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సమ్మర్ క్రాస్ ప్రోగ్రాంను ఆయన గురువారం పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే వెంటనే తెలియజేస్తే వాటిని బాగు చేసి తాగునీరు అందించేందుకు ఆటో వాహనం ద్వారా మెటీరియల్‌తో పాటు మెకానికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ డి. ఐజాక్, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సూర్యనారాయణ, ఆర్ఐ మురళి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



షెడ్‌తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రభుత్వ భూముల్లో షెడ్డు తొలగింపు

వేపాడ : మండలం వీలుపర్తి పంచాయతీ, దుంగాడ రెవెన్యూ సర్వే నెంబరు36/2 లో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన షెడ్డును తహశీల్దార్ కృష్ణంరాజు సమక్షంలో గురువారం తొలగించారు. శ్మశాన వాటికను ఆనుకుని ఉన్న ఈ స్థలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి షెడ్డు వేయడంతో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు షెడ్డును తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, విఆర్ఒ రామాంజనేయులు, గ్రామ సచివాలయం సర్వేయర్ పాల్గొన్నారు.

బొద్దాంలో భారీ అన్నదానం


వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ 7వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదల చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యం

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - మెంటాడ

పేదవాని ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర అన్నారు. మండలంలోని జక్కువ పంచాయితీలో రెండవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అని ఇంటింటికి వెళ్లి నేరుగా అడిగి తెలుసుకోవాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం ఏర్పాటు చేసామన్నారు. ఇప్పటికైనా అర్హులై ఉండి పథకాలు అందకపోతే వెంటనే సమస్యను పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపిపి సారికి ఈశ్వరరావు, సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి, ఎంపిటిసి కర్రి సంధ్య, నాయకులు లెంక రత్నకర్‌నాయుడు, తహశీల్దార్ ఆదిబాబు, ఎంపిడిఒ త్రివిక్రమరావు, హౌసింగ్ ఎఇ డేవిడ్ రాజు, ఎపిఎం దేవుడు బాబు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్లను పంపిణీ చేస్తున్న డిప్యూటీ సిఎం

వైసిపి హయాంలోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి - బొబ్బిలి

వైసిపి ప్రభుత్వం హయాంలోనే ఉత్తరాంధ్ర పూర్తి స్థాయి అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీమంత్రి సుజయ్ కృష్ణ రంగారావు, రాష్ట్ర ముఖ్యమంత్రి పైన, వైసిపి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పైన చేసిన విమర్శలను ఖండించారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆనాడు చంద్రబాబు నాయుడు హడావిడిగా భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేశారని, ఈ నాలుగేళ్లలో పూర్తిస్థాయిలో అన్ని అనుమతులూ తీసుకొచ్చి, రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఇప్పుడు అసలైన శంకుస్థాపన ముఖ్యమంత్రి జగన్ చేశారని అన్నారు. తారక రామతీర్థసాగర్ మిగులు జలాల ప్రాజెక్టు కూడా, ఎప్పుడో గత ప్రభుత్వాల్లో పూర్తి చేయవలసిన కార్యక్రమాన్ని, ఈ ముఖ్యమంత్రి బాధ్యత తీసుకొని శంకుస్థాపన చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉత్తరాంధ్రాలో అన్ని అభివృద్ధి పనులు త్వరితగతిన జరుగుతున్నాయని అన్నారు. టిడిపి హయాంలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, వైసిపి ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని, అవన్నీ నిజాలు కావని అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి చూసి ఓర్వలేక వైసిపిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

మామిడి, జీడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మామిడి, జీడి రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. రాంబాబు డిమాండ్ చేశారు. మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 8న జరగనున్న కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని గురువారం ఆయన గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక ప్రెస్ క్లబ్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మామిడి జీడి రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారని అయితే ప్రభుత్వం వారి మాటలు పట్టించుకోలేదని తెలిపారు. ముఖ్యంగా మామిడి జీడి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి మార్క్‌ఫెడ్ ద్వారా కనుగోలు చేయాలన్నారు. మామిడి పంటకు వాతావరణ భీమా అమలు చేసి పరిహారం అందించాలన్నారు. మామిడి జీడి కౌలు దారులకు కార్డులిచ్చి ఈ క్రాప్ నమోదు చేసి వడ్డీ లేని రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మామిడి యార్డును మౌళిక సదుపాయాలు అభివృద్ధి చేయడంతో బాటు ప్రభుత్వమే జ్యూస్ ఫ్యాక్టరీ, కోల్డ్ స్టోరేజీలు నెలకొల్పాలని కోరారు. కాగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్ట పోయిన మామిడి, జీడి రైతులకు ఎకరాకు 30వేల రూపాయలు పరిహారం చెల్లించి ఉద్యాన రైతుల ఎఫ్‌పిఒలకు కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఇవ్వాలని రూరల్ మార్కెట్ కలెక్షన్ సెంటర్లు కు విద్యుత్ రాయితీ ఇవ్వాలని కోరారు. 10ఎకరాల వరకు మామిడి జీడీ రైతులకు ఉచితంగా బోర్లు, సోలార్ మోటార్లు, ఇవ్వాలని గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో మామిడి పంట నష్టపోతున్నదని దీనిపై శాస్త్ర వేత్తలతో అధ్యయనం చేసి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 8న కలెక్టరేట్ ధర్నా జరుగుతుంది కాబట్టి రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.



మోసపూరిత శంకుస్థాపనలు ఎందుకు?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిఎం జగన్మోహన్ రెడ్డి మోసపూరిత శంకుస్థాపనలు చేసి ప్రజలను ఎన్నాళ్లు మోసం చేస్తారని జనసేన మండల అధ్యక్షులు పతివాడ అచ్చంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2019లో అప్పటి సిఎం చంద్ర బాబు భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన చేశారని తిరిగి అదే ఎయిర్ పోర్టుకు జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయడం ప్రజలను మరోసారి మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారని భయపడి ప్రతి పక్షాలను గృహ నిర్బంధం చేయడం చేతకాని తనమన్నారు. వైసిపి నాయకులు ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఇసుక దోపిడీ వంటి అవినీతి అక్రమాలకు పాల్పడుతుంటే అధికార్లు ప్రభుత్వ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. బటన్ నొక్కి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పుకుంటున్న అధికార వైసిపి ఆసరా పథకం నగదు ఇంతవరకు మహిళల ఖాతాలలో వెయ్యకుండా మోసం చేశారని ఆరోపించారు. ప్రస్తుతం చేసిన శంకుస్థాపనలు శిలాఫలకానికి తప్ప ప్రయోజనం ఉండదని తెలిపారు. జన సేన ప్రజలకు అండగా నిలబడి వారి సమస్యలు పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తుందన్నారు. అధికార వైసిపి విన్యాసాలు ప్రజలు గమనిస్తున్నారని తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.



పతివాడ

దుర్గులు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కీర్తి శేషులు జరజాపు పేట మాజీ సర్పంచ్ మద్దిల దుర్గులు సేవలు మరువలేనివని నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. గురువారం జరజాపుపేటలో దుర్గులు కుమారుడు మద్దిల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆయన 19వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు మాట్లాడుతూ దుర్గులు జ్యూట్ కార్మికుడిగా పనిచేస్తూ సర్పంచ్‌గా సేవలు అందించడంతో బాటు కళాకారుడిగా రంగ స్థలానికి విశిష్టమైన సేవలందించారన్నారు. గ్రామాన్ని ఏక తాటిపై నడిపించి అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం స్వర్ణ నంది జాతీయ అవార్డు గ్రహీత కడలి ప్రకాశ రావు, మిగులు ఆహారాన్ని పేదలకు అందిస్తున్న మిత్రమా వెల్ ఫేర్ గ్రూప్ ప్రతినిధి మద్దిల త్రినాథ్, రక్త దానం చేస్తున్న సాధన యువ జన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకట రమణ, ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మాత శైలజ, ఎరుబోతు నీహారికలను మాజీ సర్పంచ్ మద్దిల దుర్గులు జ్ఞాపకార్థం సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ బోని బంగారు నాయుడు, వైసిపి నాయకులు నల్లి చంద్ర శేఖర్, నల్లి శ్రీను, ఎం.ఎం.నాయుడు, మద్దిలవాసు, మద్దిల శ్రీను, టిడిపి కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, కాళ్ళ రాజ శేఖర్, సిపిఐ నాయకులు తాలాడసన్ని బాబు, రిటైర్డ్ ఉపాధ్యాయులు ఎస్. వాసు దేవరావు, కడలి ప్రకాశ రావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పగలే వెన్నెల

వేపాడ: మండల కేంద్రంలో జంట గ్రామాలైన వల్లంపూడి ప్రధాన వీధి బజారులోనూ, మరికొన్నిచోట్ల, ఒకే స్తంభానికి రెండు బల్బులు ఉన్న చోట పట్టపగలే వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. విద్యుత్తును దుబారా చేయవద్దని ప్రభుత్వం చెబుతున్నా ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టడం లేదు. గత వారం రోజులుగా రాత్రీ పగలూ తేడా లేకుండా లైట్లు వెలుగుతున్నా పంచాయతీ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పట్టపగలే వెలుగుతున్న వీధి దీపాలు

మాదక ద్రవ్యాలకు నిరుద్యోగులు బానిస

మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు

ప్రజాశక్తి - గజపతినగరం

ఉద్యోగాలు లేక యువత మాదకద్రవ్యాలకు బానిస అవుతున్నారని మాజీ ఎమ్మెల్యే కె.ఎ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు లక్షల టన్నులు గంజాయి రాష్ట్రం దాటుతుంటే కేవలం 177 కేసులు నమోదు అవుతున్నాయని అన్నారు. ఎన్‌సిబి ఏటా విడుదల చేసిన నివేదికలో గంజాయి తరలింపులో ఎపి మొదటి స్థానంలో ఉండడం దౌర్భాగ్యమన్నారు. దేశం మొత్తం ఆహార ధాన్యాలను పంపిణీ చేసిన ఘనత కలిగిన అన్నపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ ప్రస్తుత ప్రభుత్వ పరిపాలన వల్ల డ్రగ్స్ ఆంధ్రప్రదేశ్‌గా మారిందని అన్నారు. గతంలో 35 శాతం ఉన్న నిరుద్యోగం ఇప్పుడు 70 శాతానికి చేరుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత చెడు అలవాట్లకు బానిస అవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఏటా జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మంనాయుడు, రాష్ట్ర రైతు కార్యదర్శి లెంక బంగారు నాయుడు, క్లస్టర్ ఇంఛార్జి వైకుంఠం, ప్రదీప్ కుమార్, డాకి నారాయణప్పడు, మాజీ సర్పంచ్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కూలీలు

వంగర: మండలంలోని గొర్లె శ్రీరాములు నాయుడు మడ్డువలస ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువలో మగ్గూరు గ్రామం వద్ద గురువారం పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. మడ్డువలస ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాలువల్లో పిచ్చి మొక్కలతో పాటు చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఆయకట్టు రైతులు వ్యవసాయ సీజన్‌లో సాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయాన్ని ఈనెల ఒకటో తేదీన ప్రతిపాదనలకే పరిమితం అనే కథనం ప్రజాశక్తిలో వెలువడడంతో స్పందించిన మండల పరిషత్ అధికారులు ప్రస్తుతం ఎడమ ప్రధాన కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, పిచ్చి మొక్కలను తొలగింపు చేపట్టే పనులను ప్రారంభించారు. ఈ పనులును ఎంపిడిఒ శ్రీనివాసరావు, ఎపిఒ సంగాంనాయుడు పరిశీలించారు. అయితే ఎడమ కాలువలో చేపడుతున్న ఈ పనులు ఆయకట్టు రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు వర్షం వ్యక్తం చేసి ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి - బొండపల్లి

మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన తూము రామునుకు వైఎస్ఆర్ బీమా నగదు రూ.లక్షను గురువారం సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైసిపి నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు అందించారు. ఇటీవల తూము సాంబ అకాల మరణం చెందడంతో ఆయన భార్య రాముకు ఈ నగదును అందించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నగదును అందిస్తున్న వైసిపి నాయకులు

ఆప్తోమెట్రీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

దేశంలో ఆప్తోమెట్రీ కోర్సునకు మంచి డిమాండ్ ఉందని ఈ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. గురువారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో బాగా కష్టపడితే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చున్నారు. పూర్వ విద్యార్థి, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ మయోపీయా కన్సల్టెంట్ ఎ. కౌసల్య ఉపన్యసిస్తూ 2050 నాటికీ ప్రపంచ వ్యాప్తంగా ఐదు బిలియన్ ప్రజలు మాయోపియా బారిన పడే ప్రమాదం ఉందన్నారు. దీనిపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన పెంపొందించాలన్నారు. మరో పూర్వ విద్యార్థి మెడిగో ఆప్టిక్స్ నిర్వాహకురాలు యు.కృష్ణకీర్తి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఎంపిసి చదివిన విద్యార్థులకు సైతం ఆప్టోమెట్రీ కోర్సులో చేరే అవకాశం ఈ ఒక్క విశ్వవిద్యాలయంలోనే ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులను వైస్ ఛాన్సెలర్ జి ఎస్ఎన్ రాజు అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మి నరసింహ ఆచార్యులు, అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ కెవిజి కృష్ణ మూర్తి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, విభాగాధిపతి శ్రావణి, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతమ్మ, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విసి జిఎస్ఎన్‌రాజు

రాజా కళాశాలకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉద్యోగ కల్పనలో భాగంగా కళాశాలలో అందిస్తున్న క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు ఎపి స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ నుండి ప్రశంసా పత్రం అందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్ర కుమార్ తెలిపారు. తమ విద్యార్థులకు ఉద్యోగ కల్పన, పీజీ సెట్లల్లో సీట్లను సంపాదించడానికి కావలసిన అన్ని వసతులనూ కళాశాలలో కల్పిస్తున్నామన్నారు. ఎన్ఇపి 2020కు అనుగుణంగా అన్ని విధాలుగా ఉన్నత స్థాయిలో నడిపోయించే విధంగా కళాశాలలో అన్ని అవకాశాలు ఉన్నట్లుగా ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులకు సిఆర్‌టి ప్రోగ్రాంను ఎంతో విలువలతో అందిస్తూ, కళాశాలలో అత్యధిక క్యాంపస్ ప్లేస్మెంట్స్ అవ్వడానికి నిరంతరం కృషి చేస్తున్న కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎన్.శరత్ కుమార్‌ను ప్రిన్సిపాల్, కళాశాల చైర్మన్ ఆర్‌వి సుజయ్ కృష్ణ రంగారావు, కరస్పాండెంట్ ఐ మురళీ కృష్ణారావు, జాయింట్ సెక్రటరీ ఆర్ బదరీ అభినందనలు తెలిపారు.



అధ్యాపకులను అభినందిస్తున్న సుజయ్‌కృష్ణరంగారావు

సచివాలయాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని మొయిద కూడలిలో సచివాలయం-2ను కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ, యూనిఫారం ధరించాలని, బయో మెట్రిక్ హాజరును తప్పనిసరిగా వేయాలని సూచించారు. సచివాలయం ద్వారా అందుతున్న సేవలకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను నిర్ణీత సమయంలో అందించాలని ఆదేశించారు. భూ రీ సర్వేలో భాగంగా భూములకు సంబంధించిన రికార్డులను త్వరితగతిన ఆన్‌లైన్‌లో పొందిపరచాలన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాద్

నేరాలు ఘోరాలు

5 కేజీల గంజాయి స్వాధీనం

గజపతినగరం: ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరుపల్లి గ్రామానికి చెందిన పీతల శివ (25) గంజాయితో హై స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్నాడని స్థానికులు అందించారు. దీంతో ఎస్.ఐ, రెవెన్యూ సిబ్బంది, ఎలక్షన్ డిటి అతనిని పట్టుకున్నారు. తల్లి చనిపోవడంతో తండ్రి సంరక్షణ లేకపోవడంతో అతను చిన్నప్పటి నుండే చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సంవత్సరం క్రితం అతనికి యాక్సిడెంట్ అవ్వడంతో ఆ నొప్పిని తగ్గించుకోవడం కోసం గంజాయికి అలవాటు పడ్డాడు. అతని కులవృత్తి ఆధారంగా రోజు తాటి ముంజులు రాయగడ పట్టుకెళ్ళడం తిరుగు ప్రయాణంలో గంజాయిని తీసుకురావడం దానిని గ్రామాల్లో చిన్నపిల్లలకు చిన్న ప్యాకెట్ల రూపంలో ఇవ్వడం జరుగుతుంది. ఇతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించామని సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ సి.హెచ్ గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసిన వ్యక్తికి జైలు

తెర్లాం : స్థానిక శ్రీ సత్య సాయి జూనియర్ కళాశాల వద్ద జూలై 12, 2020న జన్నివలస గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి, రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నెమలం గ్రామానికి చెందిన కొనారి నరసింహులు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించిన తీర్పును గురువారం బొబ్బిలి మేజిస్ట్రేట్ ఆటో డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

పల్సర్ బైక్ చోరీ

భోగాపురం : మండలంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న నారుపేట గ్రామంలో బుధవారం రాత్రి కొత్త పల్సర్ బైక్ చోరీకి గురైంది. దీనిపై బైక్ యజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే డెంకాడ మండలం గుంకలాం గ్రామానికి చెందిన లండ విశ్వనాథ్ ఇటీవల మూడు రోజుల కిందట పల్సర్ ఎన్ఎస్ బైకును రూ. 1.80లక్షలకు కొనుగోలు చేసాడు. నారుపేట గ్రామంలో ఉన్న తన చిన్నాన్న ఇజ్జరోతు సూర్యనారాయణ ఇంటికి వచ్చాడు. బైకును ఆరుబయట హ్యాండల్ లాక్ వేసి పెట్టాడు. గురువారం ఉదయం లేచి చూసేసరికి బైకు కనబడలేదు. బైకుకు వేసిన హ్యాండ్ లాక్‌ను యాక్సిల్ బ్లేడ్‌తో కోసి అక్కడ పడేసి వెళ్లిపోయారు. దీంతో వెంటనే భోగాపురం పోలీసులను ఆశ్రయించడంతో దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక ఐటిఐ కాలనీ వద్ద కారు ఢీకొని చింతాడ గ్రామానికి చెందిన బిక్కోలు లక్ష్మణరావు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. పోలీసులు వివరాలు మేరకు.. చింతాడకు చెందిన లక్ష్మణరావు రామభద్రపురం మండలం మామిడివలసలో ఇటుకు బట్టిలో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రామభద్రపురం నుంచి బొబ్బిలి ద్విచక్ర వాహనంపై వస్తున్న లక్ష్మణరావును అదే మార్గంలో వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని ట్రాఫిక్ ఎస్ఐ పోలినాయుడు, సిబ్బంది ఆటో సహాయంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారు డ్రైవర్ మద్యం సేవించి కారు నడపడం వల్ల ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెపుతున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.